# ప్రభుత్వ విద్యార్థులకు రవాణా చార్జీలు

బస్సు సౌకర్యం లేని ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లలకు ఊరట

## అర్హుల వివరాలు అందజేసిన విద్యాశాఖ

## ఉమ్మడి జిల్లాలో 3,523 మంది విద్యార్థులకు లబ్ధి

రామగిరి, డిసెంబర్ 19 : నాణ్యమైన గుణాత్మక విద్యను అందిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి బాటలు వేస్తున్న విద్యాశాఖ, గత కేసీఆర్ సర్కార్.. ఆంగ్ల మాధ్యమం అమలు, 'మన ఊరు – మనబడి, 'మన బస్తీ – మనబడి'తో మౌళిక వసతులను కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసింది. అయితే.. బస్సు సౌకర్యం లేని ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పేద విద్యార్థులకు రవాణా భత్యం అందిస్తున్నారు. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన నిధులను విడుదల చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం అర్హులైన విద్యార్థుల జాబితాలను డీఈఓల ఆమోదంతో సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు రాష్ట్ర విద్యాశాఖ – సమగ్రశిక్షకు పంపించారు.

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణా భత్యానికి అర్హత ఉన్న విద్యార్థులు**

| జిల్లా | మండలాలు | పాఠశాలలు | విద్యార్థులు |
|---|---|---|---|
| నల్లగొండ | 32 | 1,483 | 1,495 |
| సూర్యాపేట | 23 | 612 | 1,038 |
| యాదాద్రి | 17 | 575 | 1,236 |
| మొత్తం | 72 | 2,670 | 3,769 |

### నిబంధనల మేరకు అమలు చేస్తాం



విద్యాశాఖ మంజూరు చేసే రవాణా భత్యానికి సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో అర్హత కలిగిన విద్యార్థుల వివరాలను సమగ్రశిక్ష ఆధ్వర్యంలో అధికారులు గుర్తించారు. 2022–23 విద్యా సంవత్సరం సంబంధించి అర్హుల జాబితాలను ప్రభుత్వానికి, విద్యాశాఖకు అందజేశాం. దానికి అనుగుణంగా వచ్చే విద్యా సంవత్సరం ప్రతిపాదనలు సైతం సిద్ధం చేస్తున్నారు. రవాణా చార్జీలకు సంబంధించి ఉత్తర్వులు అందగానే నిబంధనల మేరకు విద్యార్థులకు అందజేసేలా చర్యలు తీసుకుంటాం. నిధులను విద్యార్థుల వ్యక్తిగత అకౌంట్లలో జమ చేస్తాం.

– అశోక్, సూర్యాపేట డీఈఓ

### రవాణా భత్యం అమలు ఇలా..

రవాణా భత్యం నిధులను ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు వేర్వేరుగా అందిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.400, ప్రాథమికోన్నత, జడ్పీ పాఠశాలల విద్యార్థులకు రూ.600 చొప్పున చెల్లిస్తున్నారు. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు ఆయా మండలాల ఎంఆర్‌సీల నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన 3,523 మంది విద్యార్థులకు లబ్ధి కలుగనున్నది.

## మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్

భువనగిరి అర్బన్, డిసెంబర్ 19 : మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి కోడిగుడ్లు, వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని కలెక్టరేట్‌లో, డీఈఓ కార్యాలయంలో వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బిల్లులు చూపించారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో కోడి గుడ్డు ధర రూ.7లకు అమ్ముతుంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఐదు రూపాయలు చెల్లించడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతురని పేర్కొన్నారు. దీనికి తోడు రాగిజావకు కూడా డబ్బులు చెల్లించడం లేదని ఆరోపించారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.10 వేలు ఇవ్వాలని, అదేవిధంగా స్లాబ్ రేటు పెంచుతూ నిత్యావసర వస్తువులను సరఫరా చేస్తూ పిల్లలకు పౌష్టికాహారం కింద కోడి గుడ్డును సరఫరా చేయాలని, గతంలో పెంచిన వేతనంతో పాటు పెండింగ్ బిల్లులు త్వరగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సామల శోభన్‌బాబు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాగుల వసంత, ప్రధాన కార్యదర్శి ముంతాజ్ బేగం, ఉపాధ్యక్షుడు జిన్నె కృష్ణ, కోశాధికారి సంధ్య పాల్గొన్నారు.

## రైతుబంధును త్వరగా అందజేయాలి

- మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దశరథగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దశరథగౌడ్

ఆత్మకూరు(ఎం), డిసెంబర్19 : రైతులందరికీ త్వరగా రైతుబంధు అందజేయాలని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పా టు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇచ్చినమాట మాట ప్రకా రం వెంటనే రైతుబంధు ఇవ్వాలని కోరా రు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, జిల్లా నాయకుడు కోరె భిక్షపతి, గ్రామశాఖ అధ్యక్షుడు కోరె వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి బూడిద శేఖర్‌గౌడ్, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు అజీమొద్దీన్, బీసీ సెల్ గ్రామశాఖ అధ్యక్షుడు పరశురాములు పాల్గొన్నారు.

## మేడిపల్లిలో వైద్య శిబిరం

బొమ్మలరామారం, డిసెంబర్19 : మండలంలోని మేడిపల్లిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం 60 ఏండ్లు పైబడిన వారికి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా112 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ బాలాజీ, డైరెక్టర్ హమీద్, ఇన్‌చార్జీలు ఉపేందర్, స్పందన, ఆయూష్ మెడికల్ అధికారి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై అవగాహన

మోటకొండూర్, డిసెంబర్ 19 : మండలంలోని చామపూర్ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వస్తీయ ప్రోగ్రామ్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరిశుభ్రత, మెరుగైన ఆరోగ్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు అనూష, జయంత్ కుమార్, ఏఎన్‌ఎం ప్రమీల, ప్రధా నోపాధ్యాయిని శ్వేత, ఉపాధ్యాయిని శాంతకుమారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కరాటేలో లిటిల్ బడ్స్ విద్యార్థుల ప్రతిభ

బీబీనగర్, డిసెంబర్ 19 : అండర్–14, అండర్–12 విభాగాల్లో వరంగల్ పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో బీబీనగర్ పట్టణానికి చెందిన లిటిల్‌బడ్స్ పాఠశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన నైతిక, అభిరామ్, శ్రీకర్, తేజ, ప్రకాశ్, నక్షత్ర, నితీశ్, వేణు విజేతలుగా నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

## 'కృష్ణవేణి'కి ఎక్స్‌లెన్స్ అవార్డు

భువనగిరి సిటీ : హైదరాబాద్‌లోని బ్రెయిన్ ఫీడ్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా సదస్సులో భువనగిరికి చెందిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు 2023–24 విద్యాసంవత్సరానికి గానూ మోస్ట్ ఇన్‌స్పైరింగ్ స్కూల్స్ ఆఫ్ ఇండియా, మోస్ట్ ఇన్నోవేటివ్ స్కూల్స్ ఆఫ్ ఇండియాగా గుర్తించి ఎక్స్‌లెన్స్ అవార్డును మంగళవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అఖిల మాట్లాడుతూ.. పాఠశాలలో యాక్టివిటీ బేస్డ్ విద్యాబోధన పద్ధతిని గుర్తించి ఈ అవార్డు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.

## ఎల్లమ్మ తల్లికి ప్రభుత్వ విప్ అయిలయ్య పూజలు



యాదగిరిగుట్ట : పెద్దకందుకూరులో ఎల్లమ్మతల్లికి పూజలు చేసి చేతికి కంకణం కట్టించుకుంటున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, డిసెంబర్19 : శ్రీనిమ్మగుండ్ల ఎల్లమ్మతల్లికి ప్రభుత్వవిప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు జరిపారు. మంగళవారం మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో ఎల్లమ్మతల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గ ప్రజలందరికీ అమ్మవారికి ఆశీస్సులుండాలని అమ్మవారికి వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీమగాని రాములు గౌడ్, సైదాపురం సర్పంచ్ శంకర్ పాల్గొన్నారు.

## రైతులకు మరిన్ని సేవలు అందించాలి

- ఆలేరు మున్సిపల్ చైర్మన్ శంకరయ్య
- ఉత్తమ చైర్మన్‌గా ఎంపికైన గొంగిడికి సన్మానం



డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ శంకరయ్య

ఆలేరు, డిసెంబర్ 19 : డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి జాతీయ స్థాయిలో ఉత్తమ చైర్మన్‌గా ఎంపికైన సందర్భంగా మంగళవారం ఆయన నివాసంలో ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ.. ముమ్ముందు సహకార బ్యాంకుల ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ, మాజీ చైర్మన్ గడ్డమీద రవీందర్‌గౌడ్ డైరెక్టర్ పత్తి వెంకటేశ్ పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలను వెంటనే నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, వేదికపై కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు తదితరులు

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 19 : 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రతి ఐదేండ్లకు స్థానిక సంస్థల ఎన్నికలు జరుపాల్సి ఉందని, ఈ విధానం ప్రకారం ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. జనవరిలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ముగుస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేయకుండా నోటిఫికేషన్ జారీ చేసి గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికలు జరుపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహా, సీనియర్ నాయకుడు గూడూరు అంజిరెడ్డి, జిల్లా కార్యదర్శ వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, దోనూరి నర్సిరెడ్డి, మేక అశోక్‌రెడ్డి, దాసరి పాండు, మండల కార్యదర్శులు సిర్పంగి స్వామి, దయ్యాల నర్సింహా, మాయ కృష్ణ, బొడ్డుపల్లి వెంకటేశ్, జిల్లాల పెంటయ్య, మద్దెల రాజయ్య, దొడ యాదిరెడ్డి, గంగాదేవి సైదులు, గుంటోజు శ్రీనివాసచారి, బబ్బూరి పోశెట్టి, దూపటి వెంకటేశ్, పోతరాజు జహంగీర్, ర్యాకల శ్రీశైలం, గాడి శ్రీనివాస్, వనం ఉపేందర్, గడ్డం వెంకటేష్, వనం రాజు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ఆలేరు రూరల్, డిసెంబర్19 : మండలంలోని శ్రీనివాస్‌పురం, మందనపల్లి గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని గ్రామస్తులకు వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వడ్ల నవ్యాశోభన్ బాబు, పాండరి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.